రసాభాసగా సర్వసభ్య సమావేశం

- జెడ్పీటీసీ కుర్చీపై అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం
- నేలపై బైఠాయించి నిరసన తెలిపిన జెడ్పీటీసీ
- సమావేశాన్ని బహిష్కరించిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు
- పార్టీ కండువాలతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హాజరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలు

గన్నేరువరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పార్టీ కండువాలతో సమావేశానికి హాజరు కాగా తీసివేయాలని ఎంపీపీ కోరినా పట్టించుకోలేదు. గతంలో మాదిరిగా కాకుండా సభ వేదిక ముందు కుర్చీ వేయడంపై జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీపీ, అధికారులను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించనందుకు జెడ్పీటీసీతో పాటు అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీ నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అణిచివేత పాలన కొనసాగించారని లింగాల మల్లారెడ్డి తెలిపారు. తనగ్రామం హన్మాజిపల్లెలో తన కోటా నిధులతో చేపట్టిన భవనాలకు ప్రారంభోత్సవం చేసుకున్నారని, నిరంకుశ పాలనతో ప్రజాప్రతినిధులు, ప్రజలను భయంభ్రాంతులకు గురి చేశారని సభలో ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. నేడు ప్రజాప్రభుత్వంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. అలాగే గునుకులకొండాపూర్‌లో భయంకర వాతావరణ పరిస్థితులతో సర్పంచ్ జ్యోతి గ్రామం వదిలి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఎందుకు పాటించలేదని గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, మైలారం, సాంబయ్యపల్లె, చొక్కారావుపల్లె గ్రామ సర్పంచులు బెతెల్లి మమత, లింగంపల్లి జ్యోతి, దుడ్డు రేణుక, చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి జెడ్పీటీసీని ప్రశ్నించారు. రసమయి బాలకిషన్, జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ గూడెల్లి ఆంజనేయులు, ఉపసర్పంచ్ పద్మతో కలిసి పాలనకు ఆటంకం కల్గించడమే కాకుండా తనను ఇబ్బందులు గురి చేశారని సర్పంచు జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లపల్లికి ఎంపీటీసీగా ఆంజనేయులు ఎన్ని నిధులు కేటాయించారని సర్పంచ్ మమత ప్రశ్నించారు. తన ఇంటి పక్కనే అభివృద్ధి పనులు చేపట్టిన తనకు సమాచారం ఇవ్వలేదని మైలారం సర్పంచ్ రేణుక ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు లేదన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం అనంతరం సభను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బైకాట్ చేశారు. అనంతరం మండల పరిషత్ ముందు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సమన్వయంతో మండలం అభివృద్ధి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ అవినీతి రహిత పాలనకు, మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా వివిధ శాఖలను పనితీరు తెలుసుకున్నారు. గుండ్లపల్లి నుంచి మండల కేంద్రం గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండల పొత్తూరు వరకు డబుల్ రహదారికి రూ.71 కోట్ల టెండర్ పూర్తయినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. రహదారిపై చేపట్టే బ్రిడ్జీ, లో, హైలెవల్ కల్వర్టులు, ఇతర వాటిపై సమగ్ర నివేదిక అందజేయాలని ఎమ్మెల్యేగా ఆదేశించారు. అలాగే మాదాపూర్ గ్రామంలో చెరువు విధ్వంసం, ఆక్రమణపై నీటిపారుదలశాఖ అధికారుల అలసత్వాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యం ఎందుకని, సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి 15 గుంటల స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఉపకాల్వ 8 నుంచి మైలారం గ్రామానికి సక్రమంగా సాగునీరు రావడం లేదని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ రేణుక సభ దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై దృష్టి సారించాలని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసకర పాలన కొనసాగించిందని, గత ప్రభుత్వం పనులను డిసెంబర్ 31వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. గతపాలనలోని అవినీతి అక్రమాల విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్ఎస్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, ఆపార్టీ ప్రజాప్రతినిధులు దీన్ని స్వాగతించాలని, మహిళా సర్పంచులను అవమాన పరిచిన ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్‌పై మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని, తనదృష్టికి తీసుకరావాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండిలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం కరీంనగర్ సుమన్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు కళ్యాణ్‌సుమన్ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండి మానస, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాది నాగరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



సత్యప్రసన్నను సన్మానిస్తున్న నాయకులు

రామడుగు: చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె. సత్యప్రసన్నను ఆదివారం పార్టీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, నర్సింగ్, అబ్దుల్ నబీ, సురేశ్, బాబు, పలువురు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



మాట్లాడుతున్న కుమారస్వామి

శంకరపట్నం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే మహనీయుల ఆదర్శాలను అలవర్చుకొని నేటిబాలలు రేపటి పౌరులుగా ఎదగాలని పేబ్యాక్ టు స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ గాలిపల్లి కుమారస్వామి అన్నారు. మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగటానికి సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిసాయం అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులను సంస్థ ద్వారా ఆదుకుంటామన్నారు. విద్యార్థులకు రాతపరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులలో కొందరికి దుస్తులు, బహుమతులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శంకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ



నివాళి అర్పిస్తున్న వొడితెల సతీశ్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పరామర్శించారు. చిన్నముల్కనూర్‌కు చెందిన ముప్పిడి భాస్కర్‌రెడ్డి వర్ధంతికి హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ముదిమాణిక్యం గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ ఎడవెల్లి భాస్కర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంట ఎంపీపీ కొత్త వినీత, పార్టీ మండల అధ్యక్షుడు అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, సర్పంచులు వెంకటనర్సింహారెడ్డి, రవీందర్, శ్రీనివాస్, వెంకటేశం, లక్ష్మణ్, నాయకులు నారాయణరెడ్డి, రాజేశం, రాంబాబు, శ్రీనివాస్, సర్వర్‌పాషా, రైతు సమన్వయసమితి జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, జిల్లా నాయకుడు కృష్ణమాచారి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె, రాంపూర్, సింగాపూర్ గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబ సభ్యులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరామర్శించారు. వెంట మండల అధ్యక్షుడు కిరణ్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌రాహుల్, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, నాయకులు అనిల్, రామకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజ్ కుమార్, వేణు, సదానందం, వినోద్, సంపత్, గణేశ్, పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న వొడితెల ప్రణవ్

నేడు మండల సభ

చిగురుమామిడి: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎం. నర్సయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని, అలాగే ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా లెంకలపల్లి శరత్



వాసవీ క్లబ్ అధ్యక్షుడు శరత్‌కు సన్మానం

జమ్మికుంట: పట్టణంలో వాసవి క్లబ్ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమై నూతన అధ్యక్షుడిగా లెంకలపల్లి శరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా క్లబ్ సీనియర్ సభ్యులు మాట్లాడారు. పట్టణంలో 2017లో 40 మంది సభ్యులతో ప్రారంభమై 270 మందికి చేరుకొని విజయవంతంగా కొనసాగుతుందన్నారు. 2023లో క్లబ్ చందాదారుల సహకారంతో రూ. నాలుగు లక్షలతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జోనల్ చైర్మన్ సురేందర్, రీజినల్ చైర్మన్ రాజాభాస్కర్, క్లబ్ మాజీ అధ్యక్షుడు నీలకంఠం, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి సతీశ్, క్లబ్ ప్రారంభ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామం అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దరిపెల్లి సురేశ్ ఎన్నికయ్యారు. నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండేటి సుధాకర్, తాళ్లపల్లి తిరులేశ్, కనకం వెంకటస్వామి, మంతెన లక్ష్మీనారాయణ, సారయ్య తదితరులు ఉన్నారు. కాగా నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభినందించారు.

పెన్షనర్లకు సన్మానం



హుజూరాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో పెన్షనర్లను సన్మానిస్తున్న ఎంపీపీ



జమ్మికుంట: సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం నేషనల్ పెన్షనర్స్ డే ఎండీ ఉస్మాన్ బాషా అధ్యక్షతన నిర్వహించారు. వేడుకలకు ఎంపీపీ రాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్లు సమాజాభివృద్ధి కోసం విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అనంతరం 75 ఏళ్లు దాటిన 40 మంది పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం బాధ్యులు గోపాల్‌రావు, సారయ్య, గంజి జయవర్ధన్, దుర్గాజీ, గణపతి రెడ్డి, కాంతమ్మ, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీహరి పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో తెలంగాణ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల అధ్యక్షుడు టి.మోహన్‌రావు ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పెన్షనర్స్ సమస్యలపై చర్చించారు. అనంతరం సీనియర్ పెన్షనర్స్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, గౌరవ అధ్యక్షుడు రామనాధం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టీపీఆర్‌పీఏ ఆధ్వర్యంలో..

పట్టణంలోని చాణక్య డిగ్రీ, పీజీ కళాశాలలో టీపీఆర్‌పీఏ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే జరుపుకున్నారు. ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తూ పాతపద్ధతిలో పెన్షన్ ఇచ్చేందుకు సమ్మతి తెలిపినందుకు, మూడు డీఏల మంజూరు, పీఆర్సీ అమలు చేస్తామనడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జమ్మికుంట అధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, ప్రధాన కార్యదర్శి కట్ట నాగభూషణాచారి, చొల్లేటి మల్లారెడ్డి, సుధాకర్, గంగయ్య, బుచ్చిరాజం, సత్యనారాయణ, హసన్, లక్ష్మయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జమ్మికుంట: మెడల్స్ సాధించిన విద్యార్థులు



శంకరపట్నం: బహుమతులతో విద్యార్థిని

జమ్మికుంట: హనుమకొండ జిల్లా కాజీపేట్‌లోని వాసవీకల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన మూడవ జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్ పోటీల్లో పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కటాస్‌లో (13, 12, 11 ఏళ్ల విభాగం) లక్ష్మణ్, సాత్విక్ గోల్డ్‌మెడల్, సాయితేజ సిల్వర్ మెడల్, మాట్ల యశ్వంత్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈసందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, ఇంద్రనగర్ సర్పంచ్ కొడిగూటి శారదప్రవీణ్, గురుకుల పాఠశాల పీఈటీ సుమన్, రాజేందర్ విద్యార్థులను అభినందించారు.

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్‌కు చెందిన సన్నిహిత హన్మకొండ జిల్లా ఖాజీపేటలో నిర్వహించిన మూడవ జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో పాల్గొంది. 13 సంవత్సరాల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని మాస్టర్ ఎస్కే జలీల్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్‌ల సహకారంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని 38వ డివిజన్ శ్రీహరినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కచ్చు రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు నగర అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇక్కడ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ పాలకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్లముందే కనిపిస్తోందన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరమంతా సీసీ కెమెరాలు, వాటి పర్యవేక్షణకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, అన్ని కాలనీలకు చెందినవారు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శ్రీహరినగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిల్‌రావు, ఉపాధ్యక్షుడిగా మునుగొండ వీరేశం, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా నాంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కూర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా అనిల్‌యాదవ్, శేఖర్‌రావు, సాగర్‌రావు ఎన్నికయ్యారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవెంకటాద్రినగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస మహోత్సవాలను వేద పండితులు కృష్ణమాచార్యులు, వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ధనుర్మాస వ్రత కార్యక్రమాలను ఆలయ వేద పండితులు ఆరంభించగా వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ఇప్పించాలి

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు తనకు టికెట్ ఇప్పించాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి కోరారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తాను కరీంనగర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేశానని, ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ తరపున ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు నిర్వహించానని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటులో నేతకాని కులానికి చెందిన సుమారు రెండున్నర లక్షల పైచిలుకు ఓట్లు కలిగి ఉన్నారని, దీంతో పాటు ప్రధాని నరేంద్ర అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు పేదవారందరికీ కిందిస్థాయిలో అందుతున్నాయని, ఇవన్నీ తనకు అనుకూలిస్తాయన్నారు. మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, నేతకాని సంఘం సలహాదారు గోల కిష్టయ్య, ఎస్సీ ఉప కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర లక్ష్మణ్, నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు గంగరాజు, ఎం.లక్ష్మి లక్ష్మీరాజం, నాయకుడు ప్రసాదరావు, బీజేవైఎం పశ్చిమ జోన్ అధ్యక్షుడు పొన్నాల రాము, బండారి శివశంకర్, రాములు తదితరులున్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట టోల్‌ప్లాజా, ఎల్ఎండీ, అలుగునూర్‌లో ఐటీశాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబుకు నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా టోల్‌ప్లాజా వద్ద వచ్చునూరు మాజీ సర్పంచ్ శ్రీగిరి రంగారావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. రంగారావు, జిల్లా, మండల నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మధు, సమద్, శ్రీనివాస్, రమేశ్, సంపత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛమందిస్తున్న రంగారావు

శ్రీమానసాదేవి అమ్మవారిని దర్శించుకున్న కవ్వంపల్లి



సర్పంచులకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణ మండలంలోని ఖాసీంపేట, పారువెల్ల గ్రామాల్లోని శ్రీమానసాదేవి, శ్రీలక్ష్మీగణపతి ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా అంతకుముందు గుండ్లపల్లి నుంచి మండలకేంద్రం వరకు గ్రామగ్రామాన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఫీల్డ్‌అసిసెంట్లు, గ్రామకార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సర్పంచులు, ఎంపీటీసీలు దుడ్డు రేణుక, లింగంపల్లి జ్యోతి, బెతెల్లి సమత, చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, బొడ్డు పుష్పలత, అటికం రాజేశంగౌడను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాలన ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటీ, సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ట్రినిటి విద్యార్థులు

కరీంనగర్: స్థానిక లయోల కళాశాలలో ఈనెల 11, 12ల్లో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోని గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థులు జె.ప్రదీప్‌నాయక్, ఆర్.ప్రీతమ్, ఆర్.విక్రమ్, కార్తీకేయ, ఎ.శ్రీరామ్ ఎంపికైనట్లు ట్రినిటి కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. ఆదివారం ట్రినిటి కళాశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను ట్రినిటి కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

- బండరాళ్లు మీదపడటంతో దెబ్బతిన్న కారు

శంకరపట్నం: తాడికల్ శివారులో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం బండరాయిని తొలగించేందుకు బ్లాస్టింగ్ చేశారు. ఈక్రమంలో రహదారిపై వెళ్తున్న కారుపై బండరాళ్లు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతింది. బ్లాస్టింగ్ చేపట్టే కాంట్రాక్టర్ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టలేదని వాహనదారులు ఆరోపించారు. ఈవిషయమై కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డిని వివరణ కోరగా కారు స్వల్పంగా దెబ్బతిందని, వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

మినీ క్రిస్మస్ వేడుకలు



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మారుతినగర్ గెచ్చమనే ప్రార్థన మందిరంలో ఆదివారం పాస్టర్ జోజి ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కృతజ్ఞత అర్పణ పండుగ నిర్వహించి, కీర్తనలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రవిపాల్, సంఘం పెద్దలు ఇల్లందుల భద్రయ్య, వరి కొప్పుల కొండయ్య, రామనాథం, ఎర్ర సారయ్య, గుల్లి మల్లయ్య, మహేశ్, రమేశ్, గుల్లి సతీశ్, మొలుగూరి మొగిలితోపాటు క్రైస్తవులు పాల్గొన్నారు.